

# ఆ చెట్లు... మంచి నీళ్ల ట్యాంకులు!

**అనగనగా ఓ వింత చెట్టు.. పుట్టింది.. చీకటి ఖండంలో.. దీని ఎత్తు ఆకాశమంత.. చుట్టుకొలత పదిమందీ పట్టుకున్నా దొరకనంత..ఈ ఆకారపుష్టి.. అరిష్టకాలంలో అక్కడి ఎడారివాసులకు గొంతు తడారకుండా కాపుకాస్తుంది. తన కడుపు నిండా నీళ్లు పోసిన ప్రజలకు... వేసవిలో దాహమిచ్చి రుణం తీర్చుకుంటుంది. ఇలా ఒకటి కాదు వందలు! ఆ ప్రాంతానికి ప్రత్యేకమైన బేవోబాబ్ చెట్లకూ నీటికీ ఉన్న సంబంధం చిత్రం. ఆ మనుషులకూ మానులకూ ఉన్న బంధం విచిత్రం. దాహం తీర్చే చెట్ల గురించి తెలుసుకోవాలంటే... అక్కడి పరిస్థితులూ అర్థం చేసుకోవాల్సిందే!**

అవసరం... అవకాశం... ఈ రెండూ మనుషులతో చిత్రాలు చేయిస్తాయి. బతుకు దారి చూపిస్తాయి. గొంతెండి పోతుంటే... దాహం తీరే మార్గం కోసం వెతుకులాటలో వీళ్లకు ప్రకృతిలోనే పరిష్కారం దొరికింది. 'ట్రీ ఆఫ్ లైఫ్'గా పిలిచే బేవోబాబ్ చెట్లు ఈ ఉష్ణ మండల ప్రాంతాల ప్రజల ప్రాణాలు నిలబెడుతున్నాయి. నిండు వేసవి వేళ శరీరానికి సత్తువకూర్చే పండ్లనిచ్చే ఇవి, ప్రాణాధారమైన నీటికీ తమ కడుపులో చోటిస్తున్నాయి. ఆఫ్రికా ఖండంలోని మడగాస్కర్‌లాంటి దేశాల్లో వానాకాలంలో ఈ చెట్ల తొర్రలో నీటిని పోసి దాచిపెడతారు. ఎండాకాలంలో తీసి వాడుకుంటారు.





### ఏమిటీ సంగతీ...

బేవోబాబ్... ఓ ఎడారి చెట్టు. మడగాస్కర్ సహా ఆఫ్రికాలోని 32 దేశాల్లో పెరుగుతుంది. వేల సంవత్సరాల పాటు బతుకుతుంది. ఆరువేల ఏండ్ల నాటి చెట్టు కూడా ఇప్పటికీ ఈ ప్రాంతంలో ఉంది. దాదాపు వంద అడుగుల ఎత్తు వరకూ ఇవి పెరగగలవు. ఈ చెట్టు చుట్టు కొలతే దాదాపు 50 మీటర్లు ఉంటుంది. అంటే కనీసం పది పెద్ద వేప చెట్లు కలిపితే ఎంత ఉంటుందో అంత పెద్ద కాండం ఉంటుందన్నమాట. ఎందుకంటే అక్కడి వాతావరణాన్ని తట్టుకుని బతికేందుకు ఈ మాను తన కాండంలో నీటిని దాచుకుంటుంది. ఎండాకాలంలో కూడా దాదాపు 1,20,000 లీటర్ల నీటిని ఇది తన కాండంలోని స్పాంజ్ లాంటి నిర్మాణం సాయంతో నిల్వ చేసుకుంటుంది. అందుకే దీని కాండం పెద్ద బాటిల్ ఆకృతిలో కనిపిస్తుంది. బాటిల్ ట్రీగానూ దీన్ని పిలుస్తారు. వేల సంవత్సరాలు బతికే ఇవి డొల్లగా మారిపోతుంటాయి. దాని లోపల జంతువులతో పాటు కొన్ని చోట్ల మనుషులూ తల

